



# "దురాశ దుఃఖానికి చేటు"

రచన : రామవరపు వేణుగోపాలరావు

ఆనాడు ఆదివారం. త్రిమూర్తులు & కో మేడమీదిగదిలో రమణమూర్తి, రామ్మూర్తి భానుమూర్తి ఏదో బాతాఖానీ చేస్తున్నారు· వారు ముగ్గురూ అన్నదమ్ములే! కొన్ని లక్షల డబ్బుకు అధికారులు. వారికంపెనీలో సెంట్లు పౌడర్లు, స్నోలు, సువాసన సిగరెట్లు తయా రవుతూంటాయ్. ఒక్క హిందూదేశంలోనే గాక ప్రపంచమంతటా వారివస్తువులకు మంచి గిరాకీ వుంది. ఎన్నో పేరుపడ్డ పెద్దకంపెనీలు కూడా త్రిమూర్తులు అండు కంపెనీతో పోటీ చేసి నిలువలేకపోయాయి. అరు చేతులా డబ్బు నార్జించుకుంటున్నా రా మూర్తిసోద రులు. వారందరిలోకీ రమణమూర్తి పెద్ద వాడు, బ్రహ్మచారి. అరవయ్యేళ్లవాడయినా చూడడానికి చాలా దృఢంగావుంటాడు. రెండో వాడు రామ్మూర్తి. వివాహితుడేగానీ పిల్లాపీచూ లేనివాడు. ఆఖరివాడు భానుమూర్తి అవివా హితుడు. అన్నదమ్ము లందరిలోకీ ఇతనే కాస్త చదువూ సంస్కారంగలవాడు. రామ్మూర్తి, భానుమూర్తి ఎప్పుడూ ఏకాభిప్రాయంతో వుంటారు. పెద్దవాడు రమణమూర్తి అంటే మిగతా వారిద్దరికీ అదోవిధమయిన కోపం. కాని దాన్ని వారు బైటపెట్టకుండా దాచు తూంటారు.

"అన్నయ్యా! ఇవాళ పల్లావరం కొండల వద్దకు పిక్నిక్‌కు వెళ్దామా?" అన్నాడు భాను మూర్తి సిగరెట్ ముట్టిస్తూ.

"అవునన్నయ్యా! పల్లావరంకొండ ప్రకృతి అలవాలమయిన ప్రదేశం. ఎన్నాళ్లనుంచో మహాబలిపురం వెళ్దా మనుకుంటున్నాంగా! మహాబలిపురం కాకపోయినా కనీసం పల్లావర మేనా వెళదామన్నయ్యా! నాక్కూడా చాలా రోజుల్నించీ వెళ్ళాలనుంది" అంటూ రామ్మూర్తి ఆ ప్రపోజల్‌ను బలపరచాడు.

"ప్చ్....ఎందుకురా అనవసరంగా లేని పొనిశ్రమ. ఆఅకౌంట్సూ అవీ చూసుకుంటూ హాయిగా ఆదివారం గడపక ఎందుకురా ఆ విహారాలు" అన్నాడు రమణమూర్తి అదోవిధ మయిన స్వరంతో ముక్కులో పొడుంని తాపీగా దట్టిస్తూ.

"ఆదివారం హాయిగా గడపాలనే కద అన్నయ్యా, మే మీ ప్లానువేసుకుంది. ఈ అకౌంట్సు, ఇన్‌కంటాక్సులవంటి గొడవలలో నుంచి తాత్కాలికంగా తప్పించుకుని పల్లా వర ప్రకృతి కాసారంలో కాసేపు మత్స్యాల్లా ఈదుదాం అన్నయ్యా!" భానుమూర్తి భావకవి కూడాను.

రమణమూర్తి ఏదో మాట్లాడబోతూండగా వారి దూరపుబంధువూ, అకౌంటెంటూఅయిన కల్యాణ్‌కుమార్ వచ్చాడు.

"మామగారూ!" అని రికార్డులోకి చూసి ఏదో పరికించి "ఐరన్‌సేఫ్‌లో 13 వేలు కరెన్సీ వున్నట్లు రిజిస్టర్ లో నోట్‌చేయబడివుంది. కాని కేష్ లెక్కెడితే 10 వేలేవుంది. మీరు గానీ డబ్బుతీసుకున్నారా?" అన్నాడు.

"ఆఁ....అవునోయ్. కాస్త అవసరమొచ్చి తీసుకున్నా. డూప్లికేట్ బీగం నావద్దవుందిగా! డబ్బు నాపేర జమకట్టు. అంటే నా స్వంత ఖర్చులో వ్రాయి. అన్నట్లు మా వాళ్ళు పల్లా వరంకొండలదరికి పిక్నిక్‌కు వెళ్తున్నారు. నువ్వుకూడా వెళతావా?" అన్నాడు రమణ మూర్తి హృదయపూర్వకంగా. రమణమూర్తికి కల్యాణ్‌కుమార్‌పై అదోవిధమైన అభిమానం. అతనికి సంతానం లేకపోవటమే కావచ్చు మరోటి కావచ్చు.

"ఏనాటికయినా సరే నా ఆస్తి నీకు రాసి స్తానులేవోయ్!" అంటూవుంటాడు రమణ మూర్తి. కల్యాణ్‌కుమార్‌మీద అతనికున్న ప్రేమ అట్టిది! భానుమూర్తి, రామ్మూర్తులకు కల్యాణ్ అంటే పడదు.

"అట్టే నే వెళ్లనండి! నాకు చాలాపనుంది. కాస్త వీలుచిక్కినప్పుడే అకౌంట్సూ అవీ సరి చూసుకోవాలి. లేకపోతే తర్వాత తడిసి మోపె డవుతుంది" అన్నాడు కల్యాణ్‌కుమార్.

"ఇంతేనా ఇంకా మాట్లాడవలసిందేమన్నా వుందా?" అన్నట్లు చూసాడు భానుమూర్తి.

"వస్తానండి!" అని కల్యాణ్‌వెళ్లిపోయాడు.

"అరే ఉండవోయ్, అలా సోఫాలో కూర్చో వెళుదువుగాని...." అని సోఫా చూపెట్టాడు రమణమూర్తి. తప్పనిసరిగా ఇబ్బందిగా కూర్చున్నాడు కల్యాణ్‌కుమార్.

"అన్నయ్యా! నువ్వుమాత్రం తప్పనిసరిగా రావాలి!" అన్నాడు భానుమూర్తి ఆఖరిదమ్ము దిట్టిగా పీలుస్తో.

"కల్యాణ్‌వస్తే నేనూ వస్తాను" అన్నాడు రమణమూర్తి ఉత్సాహంగా. అయిష్టంగా చూసాడు భానుమూర్తి. రామ్మూర్తి కాస్సేపు ఆలోచించి—

"సరేరా అన్నయ్యా! ఎలాగోలాగు నువ్వు రావడమే మాక్కావల్సింది" అన్నాడు.

నలుగురూ సోఫాల్లోంచి లేచారు.

"స్వామిని బజారుకు పంపి పాలూ, కాఫీ, పండ్లు బిస్కెట్లు తెప్పించండి మన ప్రయా ణానికి" అన్నాడు రమణమూర్తి.

మఱుక్షణంలోనే అన్ని వస్తువులూ సమ కూర్చబడ్డాయ్. రమణమూర్తి, రామ్మూర్తి, కల్యాణ్ కారులో కూర్చున్నారు. మెడలో

'కెమెరా'ను తగిలించుకుని భానుమూర్తి వచ్చాడు.

"అంతా అయినట్టేనా!" అన్నాడు భానుమూర్తి స్టీరింగ్‌వద్ద కూర్చుంటూ.

"ఆఁ .... అయినట్టే బయల్దేరడమే తరువాయి" అన్నాడు కల్యాణ్.

కారు స్టార్ట్‌చేసాడు భానుమూర్తి. నలుగురినీ మోసుకుని కమాండర్‌కారు మద్రాసు నగర పొలిమేరలను దాటిపోయింది.

* * *

"హీ....రో!" అంటూ రాగయుక్తంగా ఎవరినో పిల్చాడు డిటెక్టివ్ నాగార్జున్. తోకనాడిస్తు ఓ అల్సేషియన్‌కుక్క వచ్చింది. ప్రేమగా దాని జూలును నిమిరాడు నాగార్జున్.

"డ్రాయర్‌లోని 'కాప్స్టన్'టిన్ తీసుకరా!" అన్నాడు. చరచరా పరుగెత్తుకునివెళ్లి నోటితో ఓ టిన్ను తీసుకువచ్చింది హీరో.

ఓ సిగరెట్‌తీసి పెదిమలమధ్య పెట్టాడు నాగార్జున్. ఎదురుగానున్న మఖ్‌సోఫాలో కూర్చున్న అతనిభార్య మృణాళినికుడుతూన్న ఎంబ్రాయిడరీ ఓ పక్కపెట్టి టేబిలుమీదనున్న సిగార్‌లైటర్‌ను వెలిగించి సిగరెట్ వద్ద పెట్టింది ఘంగా పొగపీల్చి వరుసగా అయిదారు గులు వదిలాడు.

గణగణమంటూ మ్రోగింది టెలిఫోన్. రిసీవరుని చెవిదగ్గర పెట్టుకుంది మృణాళిని.

"ఎవరు?" అన్నట్లు ప్రశ్నార్థకంగా చూసాడు నాగార్జున్ మృణాళిని వేపు.

"మీ లంబోదరం మహాశయుడు...." అని నవ్వుతూ రిసీవర్‌ని నాగార్జున్ కందించింది మృణాళిని.

"హల్లో — డిటెక్టివ్ నాగార్జున్ మాట్లాడుతూంట!"

"........................"

"ఓ–ఇన్స్పెక్టర్ లంబోదరంగారా? ఏంటి సంగతి?"

"........................"

"సరే వస్తున్నా!" అని రిసీవర్‌ని హుక్‌కు తగిలించాడు.

"కిట్టూ!"

"సార్!" అంటూ వచ్చాడు కిట్టు.

"బ్లూ—బర్డ్ రెడీయేనా?"

"రెడీ సార్!" అన్నాడు కిట్టు.

ట్వీడుసూటుని ఐదు నిముషాల్లో ధరించాడు నాగార్జున్. చకచక పరుగెత్తాడు పోర్టికో వైపు.

"పల్లావరం కొండలవద్దకు వెళ్ళాల్సిన పని తగిలింది మనకు త్వరగా పద!" అన్నాడు రోల్సురాయిస్ బేక్‌సీట్లో కూర్చుంటూ.

"యస్ సార్!" అన్నాడు కిట్టు.

ఆకాశంలోని పక్షిలాగు వీధుల్లోంచి వడిగా దూసుకుపోతోంది - బ్లూ - బర్డ్. డిటెక్టివ్ నాగార్జున్ తన రోల్సురాయిస్ కారుకి 'బ్లూ - బర్డ్' అని పేరుపెట్టాడు.

"కిట్టూ స్టాప్!!!"

పెద్దకుదుపుతో కారాగింది. నలిగినసూట్‌ని సరిచేసుకుంటూ కారుదిగాడు డిటెక్టివ్ నాగార్జున్. ఇన్‌స్పెక్టర్ లంబోదరంవచ్చి విష్ చేసాడు.

"లంబోదరం భాయ్! క్యాహెూ గయా?" అంటూ ముందుకు నడిచాడు డిటెక్టివ్ నాగార్జున్ తన అరిస్ట్రాక్రేటిక్ మీసాలను తడుముకుంటూ.

అతనిప్రశ్నకు సమాధానంగా రాళ్లమధ్య పడి లొత్తలుపోయిన ఓ కారుని చూపించాడు ఇన్‌స్పెక్టర్ లంబోదరం.

"ఎవరిదా కారు? ఎందుకు పడిపోయింది? అసలా కారు ఇక్కడకు రావల్సిన అవసరమేమొచ్చింది ?

"మహాప్రభూ! నీకో నమస్కారం. ఒక ప్రశ్న ఒక సమాధానం. అంతేగాని నీప్రశ్నల వర్షాన్ని శరపరంపరగా కురిపించేస్తున్నావ్ గదా నేనేమయినా శతావధాని ననుకున్నావా? అష్టావధాని ననుకున్నావా ? ఏకటాకీని సమాధానాలు చెప్పటానికి" అని ఇన్‌స్పెక్టర్ లంబోదరం కాసేపు బిగ్గరగా నవ్వాడు.

ఈ సస్పెన్స్‌ని నాగార్జున్ పళ్లమధ్య గట్టిగా బిగించి మొహంలోకి సీరియస్‌నెస్ తెచ్చుకుని మౌనంగా లొత్తలుపడివున్న కారుకేసి చూడసాగాడు. కాసేపయిన తర్వాత లంబోదరం ఇలా అన్నాడు.

"మై డియర్ యంగ్ డిటెక్టివ్ నిన్ను సస్పెన్సుసాగరంలో ఇంకా ముంచి నొక్కిపెట్టడం నా కిష్టంలేదు...."

"ఇదోసస్పెన్సా? విడిసినట్టేవుంది" అంటూ తేలిగ్గా నవ్వాడు నాగార్జున్.

"భాయ్ జయంనీదే!" ఒప్పుకోక తప్పింది కాదు ఇన్‌స్పెక్టర్ లంబోదరానికి.

"అసలు సంగతి క్లుప్తంగా చెప్తా విను! త్రిమూర్తులు అందు కో పేరు వినేవుంటావ్. ఒక్క ఇండియాలోనేకాక ఇతరదేశాల్లోకూడా పేరుపడ్డ కంపెనీ అది. దాని అధిపతులయిన రమణమూర్తి రామ్మూర్తి, భానుమూర్తి వారి ఎకౌంటెంట్ కల్యాణ్‌కుమార్‌తో సహా ఇక్కడకు పిక్నిక్‌గా వచ్చారు. కారుని ఆ కనబడే గుట్టవైపు పెద్దన్నదమ్ముడయిన రమణమూర్తిగారు ఎందుకో జోరుగా డ్రైవ్‌చేసుకుని పోతున్నారట. ఇది గమనించిన రామూర్తిగారు ఆగమని ఎన్నికేకలువేసినా వా రాగకుండా గుట్టమీదకెక్కి కారుతోసహా ఆ అగాధంలోకి పడిపోయారట. ఇదీ జరిగిన సంగతి...."

"ఎన్ని గంటలకు జరిగిందీ సంఘటన?" అన్నాడు డిటెక్టిప్ నాగార్జున్.

"సరిగా 11 గంటలకట!"

"ఎవరు చెప్పారు?"

"ఎకౌంటెంట్ కల్యాణ్‌కుమార్!"

"దట్సాల్‌రైట్ మీరు వెళ్లి కారుతాలూకు ఫొటోలూ అవీ తీయించకండి! శవాన్ని బయటకు తీసే ప్రయత్నంలో ఉండండి! నేను వారిని ప్రశ్నిస్తుంటాను" అన్నాడు డిటెక్టివ్ నాగార్జున్.

"అట్లానే భాయ్!" అంటూ పోయాడు ఇన్‌స్పెక్టర్ లంబోదరు.

నాగార్జున్ చుట్టూ కలయఁజూసాడు. చూడగా సమీపంలోనేవున్న ఓ చెట్టుక్రింద నున్న రాయి అతనిదృష్టిపథంలోపడ్డది. ఉషారుగా అటుకేసి నడిచాడు. జేబులోని సిల్క్ రుమాలుతో రాయిమీదనున్న ధూళిని తొలగించి, దానిపై పరచి ఆసీనుడయ్యాడు.

"ఏయ్ 441 అకౌంటెంట్ కల్యాణ్ కుమార్ నిలా పిలువ్!" అన్నాడు నాగార్జున్ కాప్స్టన్ సిగరెట్ ముట్టిస్తూ.

"యస్సార్!" అంటూ పోయాడతను.

కాసేపట్లో కల్యాణ్‌కుమార్ వచ్చి నమస్కారంచేసాడు. నమస్కారం స్వీకరిస్తు కూర్చోమన్నాడు నాగార్జున్.

"మీపేరు కల్యాణ్‌కుమార్ కదూ!"

"అవునండీ!"

"చనిపోయిన రమణమూర్తిగారు మీకే మౌతారు?"

"దూరపుబంధువు, వరుసకి మామయ్య"

"ఆయన మిమ్మల్ని ప్రేమగాచూసేవారా?" బేటరీలైట్‌లాంటి తనకళ్లతో కల్యాణ్‌ముఖకవళికలను సర్వేచేయసాగాడు డిటెక్టివ్ నాగార్జున్. కాసేపు దుఃఖభరంతో మాట్లాడలేక పోయాడు కల్యాణ్ తర్వాత.

"ఆయన నన్నెంత ప్రేమగా చూసేదీ నేను చెప్పలేను. నేనంటే వారికి ఆరోప్రాణం. ఐ కాంట్ ఎక్స్‌ప్లెయిన్ హిజ్ లవ్. అపాన్ మి ఇన్ వర్డ్స్...." అన్నాడు.

"దట్సాల్ రైట్! అయితే మద్రాస్‌నుండి మీరెన్నిగంటలకు బయల్దేరారు?"

"సుమారు 8 గంటల కనుకుంటా!"

"అయితే ఇక్కడకు వచ్చి మీరేమేం చేసారో చెప్పగలరా?"

"నాకు వేట అంటే సరదా! కూడా తీసుకు వచ్చిన గన్‌తో అలా పిట్టలుకొట్టడానికివెళ్లాను. పిట్టల్ని వేటాడుతూ అలా ఎంతదూరం పోయానో నాకే తెలియదు. వాచ్‌చూడగా పద కొండు గంటలయింది. వాళ్ళు నా కోసం ఎదురుచూస్తుంటారని వెనక్కితిరిగి పోబో తున్నాను. ఇంతలో ఏదో పెద్ద శబ్దం విన్పించింది. పరుగు పరుగున వచ్చాను. చూసే సరికి ఇదీ పరిస్థితి!" అని ఆగాడు కల్యాణ్.

"ఆ సమయంలో — అంటే కారు క్రింద పడిన సమయంలో రామమూర్తి, భానుమూర్తి లు ఎక్కడ వున్నారో మీరు గమనించారా?" అన్నాడు నాగార్జున్.

"ఆఁ....నేను పరుగుపరుగున వచ్చేసరికి రామ్మూర్తి ఉల్లిపాయలు తరుగుతున్నాడు. చేతుల్లోవున్న కామెరాతో ఎట్నుంచో భానుమూర్తి పరుగెత్తుకొస్తున్నాడు...."

"రమణమూర్తిగారి ఆస్తిలో మీకేమయినా భాగం వుంటుందా?" అన్నాడు నాగార్జున్ హఠాత్తుగా టాపిక్ మార్చి.

కల్యాణ్‌కుమార్ పేలవంగా నవ్వాడు.

"నా ఆస్తంతా నీకే వ్రాసిస్తానోయ్! ఏనాటి కయినా....అని ఆయన అంటూండేవారు కాని...."

"రాయకముందే చనిపోయారు ఔనా—" అన్నాడు నాగార్జున్.

మెల్లగా తలవూపాడు కల్యాణ్.

"సరే మీరిక పోవచ్చు అన్నట్లు దయచేసి భానుమూర్తిని పిలువండి!"

"అట్లాగే!" అంటూ పోయాడు కల్యాణ్ కుమార్.

"నమస్తే సార్!"

"నమస్తే! రండి కూర్చోండి!"

రాయిమీద కూర్చున్నాడు భానుమూర్తి. అతని షార్క్‌స్కిన్‌పాంటుకి కాస్తంత బురద అంటుకునివుంది. చేతికికూడా ఏదో ఆయిల్ అంటుకొని జిడ్డుగా కన్పిస్తోంది. మెడలో విలాసంగా కెమెరా వ్రేలాడుతోంది.

"గుట్టమీదనుంచి రమణమూర్తి గారు కారుతోసహా పడిపోయినపుడు మీ రెక్కడ వున్నారు?" సూటిగా అడిగాడు డిటెక్టివ్ నాగార్జున్. భానుమూర్తి తన కెమెరా వంక చూస్తు చెప్పసాగాడు.

"నేను కెమెరా పట్టుకుని అలా ఆ కనుపించే వాగువైపువెళ్లాను. ఏమయినా చక్కని దృశ్యాలుంటే తీసుకుందామని .... ఐదారు ఫొటోలు తీసుకునేసరికి ఏదో పెద్ద శబ్దం విన్పించింది. పరుగెత్తుని నేను వెళ్లేసరికి కారు ముద్దయిపోయి వుంది .... లోపల మా అన్నయ్య చచ్చిపడున్నాడు. గబగబ డాక్టర్‌కీ పోలీసులకీ కబురంపాం...."

"అదేసమయంలో మీఅన్నయ్య రామ్మూర్తి గారేం చేస్తున్నారో మీరుగాని చూసారా?"

"ఏవో తరుగుతున్నాడు .... ఉల్లిపాయలు గామోసు!"

"సరే! ఇఫ్ దేరీజ్ నో అబ్జక్షన్ .... మీరు తీసిన సీనరీస్ కడిగించిన తరువాత నాకు చూపండి...."

"సర్టన్లీ"

"ఇఖ, మీరు వెళ్లి మీ బ్రదర్ రామ్మూర్తి గారినిలా పిలవండి!"

బుర్రవూపి భానుమూర్తి వెళ్ళాడు.

తదనంతరం రామ్మూర్తి ప్రవేశించాడు. అతని మొహంలో కృత్రిమమైనవో లేక సహజమైనవో కాని విషాదరేఖలుమాత్రం దట్టం అలముకొనివున్నాయ్. దుఃఖార్ద్రమై వున్నాయాతని కనుకొలకులు.

"రండి రామ్మూర్తిగారూ! మిమ్మల్నీ విచార సమయంలో ఇలా బాధపెట్టడం ఉచితం గాదు. కాని...మాపని మేం చేసుకోవాలిగా. కాస్త నా ప్రశ్నలకు క్లుప్తంగా సమాధానాలు ఈయండి!" అన్నాడు డిటెక్టివ్ నాగు. రామమూర్తి కాసేపు మౌనంగా కూర్చున్నాడు. తర్వాత భారంగా బుర్ర ఆడించి 'అడగండి!' అన్నాడు.

"ప్రమాదం సంభవించిన సమయంలో మీరేం చేస్తున్నారు?"

"ఉప్మాకోసం ఉల్లిపాయలు చెక్కుతున్నాను."

"అలాగా! ఆ సమయంలో మీ తమ్ముడు భానుమూర్తి గారెక్కడున్నారో చెప్పగలరా?"

"చెప్పగలను! వాడు అలా ఆ వాగుకేసి ఫొటోలు తీసుకుందామని పోయాడు. నే చూసాను కూడా!"

"కల్యాణ్‌కుమార్?"

"ఏమో నేనుమాత్రం కల్యాణ్‌కుమార్‌ని గమనించలేదు. ఆతనెట్లు వెళ్ళాడో ఏమో?"

"ప్రమాదం సంభవించకమునుపు రమణమూర్తిగారు మీతో ఏమన్నా మాట్లాడారా?"

"ఉఁహుఁ.... ఇంటిదగ్గర్నుంచి తెచ్చుకున్న ఏదో వేదాంతగ్రంథాన్ని చదువుకుంటూ కార్‌లో కూర్చున్నాడు. కాసేపటికి విసుగుగా

పుస్తకం మూసాడు. ఆతర్వాత వాడి చేష్టల్ని నేనాట్టే గమనించలేదు. ఇంతలో కారు స్టార్టయిన శబ్దం విన్పించి అటుకేసి తిరిగాను. 'ఎక్కడికి అన్నయ్యా!' అని అడిగాను. సమాధాన మీయకండా స్పీడ్‌గా ఆ కనుపించే గుట్ట మీది కెళ్ళాడు. తర్వాత పెద్ద శబ్దంచేసుకుంటూ కారు రాళ్ళల్లోపడి చితికిపోయింది. కారుతోపాటు మా అన్నయ్యాకూడా" వెక్కి వెక్కి యేడుస్తు చేతుల్తో మొహాన్ని కప్పుకున్నాడు రామ్మూర్తి.

"పాపం...." అన్నాడు నాగార్జున్ ఏదో ఆలోచిస్తు.

"మీ అన్నయ్య కల్యాణ్‌కుమార్‌కి తన ఆస్తినంతా వ్రాసి యిస్తాననే వారట. నిజమేనా? నిజమే అయితే అలా వీలువ్రాసారా?"

తలెత్తిచూసాడు రామ్మూర్తి.

"ఏదో సరదాకు అప్పుడప్పుడు అలా అంటూండడం కద్దు. నిజమో....అబద్ధమో నాకు తెలీదు. నాకు తెలిసినంతమట్టుకి అతని పేర వ్రాయలేదు" అన్నాడు.

ఇంతలో ఫోర్‌ఫార్టివన్ వచ్చి శాల్యూట్ చేసాడు.

ఇన్‌స్పెక్టర్‌గారు పిలుస్తున్నారు సార్!

"వస్తున్నానని చెప్పు!"

"యస్సార్" అంటూ కాన్స్టేబుల్ వెళ్లిపోయాడు.

"పదండి అలా వెల్దాం!" అంటూ డిటెక్టివ్ నాగార్జున్ లేచాడు.

ఇద్దరూ ప్రమాదం జరిగిన స్థలంవద్దకు వెళ్లారు.

ఇదుగోటి భాయ్! శవం జేబులోని వస్తువులు అంటూ ఓ హేండ్‌కర్చీఫ్‌పైన నున్న వస్తువులనుచూపాడు ఇన్‌స్పెక్టర్ లంబోదరం.

జాగ్రత్తగా వాటిని పరిశీలించాడు డిటెక్టివ్ నాగార్జున్. నగం తరిగిపోయి ముల్లులేని ఓ పెన్సిల్, పెన్, నోట్‌బుక్, ఒక పోస్టుకార్డు కారుతాలూకు ఇగ్నిషన్ కీ నలిగిపోయిన 5 పది రూపాయిలనోట్లు ఇవీ ఆ వస్తువులు.

నాగార్జున్ కళ్లు బల్బుల్లా వెలిగాయ్ ఆ వస్తువుల్ని చూడగానే, టిన్నులోని కాప్స్టన్ సిగరెట్‌తీసి ఎర్రని తన పెదిమలమధ్య వుంచాడు. సిగార్‌లైటర్‌తో సిగరెట్ ముట్టించి గట్టిగా దమ్ములాగాడు.

మిస్టర్ రామ్మూర్తి! కారుని మీ అన్నయ్యగారు నడుపుతూండడం చూసారుగదూ!

చూసేను!

ఆ ఇగ్నిషన్ కీ మీ కారుదేనా?

చూసింతర్వాత 'అవున'న్నాడు రామ్మూర్తి.

మై డియర్ ఇన్‌స్పెక్టర్ లంబోదరం!

వాట్ మై డియర్ బోయ్!

బేడీలు రెడీయేనా?

అనుమానంగా! రెడీయే!!

లాల్చీచీ అయి శ్రీ రమణమూర్తిగారిని హత్యచేసిన నేరంక్రింద రామ్మూర్తి, భానుమూర్తులను అరెస్టుచేయ్!

సందేహిస్తున్నావేం భాయ్! అన్నాడు నాగార్జున్ తాపీగా.

మిస్టర్ నాగార్జున్ మీరెంత మేథావంతులయిన డిటెక్టివ్‌లయినా ఈ విషయంలో మాత్రం పొరబడ్డారు. నిర్దోషుల్ని దోషులుగా చేస్తున్నారు. నేను పరువునష్టం దావావేస్తే తత్ఫలితం తెలుసా? అన్నాడు భానుమూర్తి ఆవేశంగా.

బిగ్గరగా నవ్వాడు నాగార్జున్.

ఆ మా ట లే నే నందామనుకుంటున్నా రామ్మూర్తిగారూ! మీరెంత మేధావంతులయిన వ్యాపారులయినా ఐ మీన్ హంతకులయినా ఈవిషయంలోమాత్రం మీరు పొరబడ్డారు.... రమణమూర్తిగారు కార్ నడుపుతూండగా చూసామన్నారు. ఒకవేళ ఆయనే గనుక కార్ డ్రైవ్‌చేసుకుని గుట్టమీదికి వెళ్తే ఇగ్నిషన్ కీ కార్‌తాలూకు స్విచ్‌బోర్డువద్ద వుండక ఆయన జేబులో ఎలా వుంటుంది. మాట్లాడరేం రామ్మూర్తిగారూ! రామ్మూర్తిమొహం కత్తివేటుకి నెత్తురుచుక్క రానంతగా తెల్లబడిపోయింది.

రమణమూర్తిగారు తమ భాగపు ఆస్తిని కల్యాణ్‌కుమార్‌కి వ్రాసియిస్తారని మీరు భయపడ్డారు. అన్నయ్య ఆస్తి అన్యులకు సంక్రమిస్తుంటే చూసి ఓర్వలేకపోయారు. పిక్‌నిక్ నెపంమీద ఈ కొండలవద్దకు తీసుకొచ్చి ఆయన్ను మట్టుపెట్టారు అంటూ భానుమూర్తి వైపు చూసాడు డిటెక్టివ్.

తల దించేసాడు భానుమూర్తి.

ఉన్నడబ్బు చాలక అన్న డబ్బుకోసం దురాశపడ్డారు. 'దురాశ దుఃఖానికిచేటు' అని పెద్దలు ఊరికే అన్నారా? అంటూ తన రోల్సు రాయిస్ — బ్లూబర్డ్‌వైపు నడక సాగించాడు డిటెక్టివ్ నాగార్జున్.

ఎంతపెద్ద హంతకులయినా ఏదో ఓ చిన్న తప్పువల్ల దొరికిపోతారు. నేరస్తులు తప్పించుకోడం అసాధ్యం! అంటూ కూర్చున్నాడు కారులో.

'థాంక్స్ మై డియర్ ఫ్రెండ్! హంతకుల్ని క్షణంలో కనిపెట్టి నాకు శ్రమలేకుండాచేసావ్! వెరీ మెనీ థాంక్స్ టు యూ!! అన్నాడు రామ్మూర్తి, భానుమూర్తులను అరెస్టుచేసిన లంబోదరం.

'నాకు థాంక్స్ చెప్పకు లంబోదరం! వారిద్దరికీ చెప్పు! వారు చేసిన చిన్న తప్పే కదా వారిని పట్టించింది!' అని పకపక నవ్వాడు నాగార్జున్. దానితో శ్రుతి కలిపాడు లంబోదరం. అప్పుడే స్టార్టయిన కారురొదలో వారి నవ్వులు లీనమయ్యాయ్.

★


## కస్తూరి మాత్రలు

జలుపు, సాధారణ శీతలముచేత దగ్గులు, జ్వరము, గొంతులో కరకరమని యుండుట తల భారము మొదలగువాటిని పోగొట్టును. ఈమాత్రలు బిడ్డలుమొదలు వృద్ధులువరకు ఎంత వయస్సుండినను వాడుకోవచ్చును.

25 మాత్రలు గల బుడ్డి 1-కి రు. 1=00

తపాలా చార్జి రు. 1=12

ధనలక్ష్మి అండ్ కో.,

తపాల్‌పెట్టె నెం. 1376, మద్రాసు-1.